# ఎదిగే చంద్రుడు

సెరంగూన్ రోడ్ మీద కోమల విలాస్‌లో కూర్చుని రవ్వ ఇడ్లీ తింటున్నప్పుడు గుర్తు వచ్చాయి, తల్లి మాటలు కుముదినికి.

అమాటలు మనసులోనే పునశ్చరణ చేసుకుంటూ నవ్వుకుంది. ఆ నవ్వు పెదవులు దాటి పైకి రావడంతో చంద్రశేఖరం పసికట్టాడు కూడా. "ఎందుకు నవ్వుతున్నావు" అని అడిగాడు.

"ఏమీ లేదు" అంది కుముదిని.

"ఏమీ లేదని చెప్పడం మామూలు మాటేగా! ఏమీ లేకుండా ఎవరూ నవ్వరు. అలా నవ్వేవాళ్ళను పిచ్చివాళ్ళు అంటుంది ప్రపంచం. చెప్పండి. నేను కూడా ఆనందిస్తానుగా!"

కుముదినికి చెప్పడం ఇష్టం లేదు. కానీ, ఏదో చెప్పేదాకా చంద్రశేఖరం పూరుకోడు. సస పెడతాడు.

"కొన్నివేల మైళ్ళు ఉద్యోగం కోసం వచ్చాం. దేశం కాని దేశంలో చిక్కుకుపోయాం. అయినా, రవ్వ ఇడ్లీ కోసం ఇంత దూరం రావడం తల్చుకుంటే...నా వెర్రికి నాకే నవ్వు వస్తోంది. అంతకంటే ఇంకేంలేదు"

చంద్రశేఖరం కూడా హాయిగా నవ్వుకున్నాడు.

సింగపూర్ వచ్చినా ఈ 'లిటిల్ ఇండియా'లో తిరుగుతూ ఉంటే-బొత్తిగా తెలుగుదేశం అనలేముగాని-దక్షిణాదిలో నడయాడుతున్నట్లే వుంటుంది. పూలు, బట్టలు, తినుబండారాలు, ధనకనక వస్తువాహనాల దుకాణాలు, ఓహ్, ఎన్నో! జనం రద్దీగా తిరుగాడుతూ వుంటారు అప్పుడప్పుడూ ఓ తెలుగు మాట ఏదో నోటి నుంచి బయట పడుతూ ఉంటుంది. అయినా, ఎక్కువ వినిపించేది తమిళమే మదరాసులో పాండీ బజార్ (ఇప్పుడు దాని పేరు మార్చేస్తే మటుకేం గాక!)లో తిరుగుతున్నట్లే ఉంటుంది. ఈ సెరంగూన్ రోడ్.

'ముప్పయ్ తొమ్మిదేళ్ళు వచ్చేస్తున్నాయి. ఇంకా ఎప్పుడు పెళ్ళి, ఎప్పుడు పిల్లలు...' ఇదీ సత్యవతమ్మ గుంజాటన. తనకు పదహారో ఏటే పెళ్ళయింది. ఆలస్యం అనుకుంటూనే ఇరవయ్యో ఏట కుముదినిని కన్నది. పిల్లకు ఇంకా అయిదేళ్ళయినా నిండకుండానే ఆయన 'హరి' అన్నాడు. అప్పటి నుండి- డబ్బుకు ఏ ఇబ్బంది లేదు గనుక- కుముదినిని తానే

తల్లీ, తండ్రీ అయి పెంచింది. చదువు చెప్పించింది. ఉద్యోగం వేయించిది.

బాగా అలవాటు అయిపోయింది. గనుక, ఆయన ఆస్తిపాస్తులు సేకరించి ఉంటారు గనుక, సింగపూర్ వదలవలసిన అవసరం లేకుండానే పోయింది. ఆయన ధర్మమా అని ఇక్కడ అన్నీ సదుపాయాలే.

కుముదినికి తన దుగ్ధ అర్థం కాదు-అనుకుంటుంది సత్యవతమ్మ.

"అన్నిటికీ నీకు తొందరే. కావల్సినప్పుడు అన్నీ అవుతాయి. ఊరికే తన్నుకులాడితే ఏం లాభం అంటుంది కుముదిని. దుగ్ధపడకుండా, దాన్లో దగ్ధం అయిపోకుండా ఏ పని అవదు అని సత్యవతమ్మ కూతురుకు ఎంత చెప్పీ ఏమీ ప్రయోజనం లేదు.

'హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాను. నాకు నచ్చిన, నన్ను చేసుకుంటానన్న వాడు దొరికినప్పుడే అవుతుంది పెళ్ళి దీనికోసం నువ్వు తెలుగు దేశం వెళ్ళి పనివేళా వెదకవలసిన అవసరం లేదు. ఊరికే తొందరపడితే మటుకు ఏం లాభం' అని కుముదిని తనకు తాను ధైర్యం చెప్పుకుందుకు ప్రయత్నించినా, ఈ మనోనిబ్బరం ఎక్కువగా నిలబడలేకపోతోంది. వృద్ధ కన్యగానే ఈ జీవితం తెల్లవారిపోవాలా? చుట్టూ ఉన్న ప్రపంచం చూస్తూ ఉన్నప్పుడు కాస్త చింతగా వుండేమాట నిజమే. పెళ్ళీ, సంసారం, పిల్లలు, వాళ్ళను పెంచడం, పెద్ద చేయడం, వాళ్ళకు బాధ్యత వహించడం...ఇదంతా జీవితంలో తప్పనిసరిగా నడవవలసినవే కావచ్చు. అయినా, వాటికోసం మనసు పాడు చేసుకుంటే ఎలా? మనసు పాడయిపోక ముందే ఏదయినా సందర్భ పడితే చాలు. అంతే చాలు అనిపిస్తుంది. ఒక్కొక్కమారు సందర్భాలు వెతుక్కుంటూ వెళ్ళాలా! లేక వాటి అంతట అవే ముందుకు దూకి మీద పడతాయా? గొప్ప ప్రశ్నే కానీ, సమాధానం ఒకంతట దొరకదు. చూస్తూ ఉండడమే, కనిపెట్టుకు ఉండడమే మార్గం మరొకటి లేదు.

కుముదినికి అకస్మాత్తుగా తెల్లవారినట్లు అయింది. సూర్యోదయం కనిపించినట్లు అయింది చంద్రశేఖరాన్ని చూసినప్పుడు అతను ఆంధ్రప్రదేశంలో మరో మూల నుంచి వచ్చాడు. ఎం.బి..ఏ అయి అప్పుడే మొదటి ఉద్యోగంలో చేరాడు. కుముదినికి ఆఫీస్‌లో అసిస్టెంట్ చురుకయినవాడు, పైకి రాదగ్గవాడు. అందుకు కావలసిన అర్హతలన్నీ ఉన్నవాడు...అనుకుంది అతన్ని చూసిన మొదటి రోజునే.

అతన్ని 'సెంటోసా'కు తీసుకుపోయింది. పులిని చూసి సింహం అనుకున్న రాజకుమారుడిని గురించి చెప్పింది. ఇక్కడి రాచకన్యను వివాహం చేసుకున్న కథ చెప్పింది. ముప్పయ్ ఏడు మీటర్ల ఎత్తయిన మెర్-లయన్‌ను చూపించింది. 'సింహకన్య' అని తాను మనసులో పెట్టుకున్న పేరు కూడా చెప్పింది.

వాళ్ళ పరిచయం బాగా ఎదిగింది. ఎన్నో ఆశలు, ఆకాంక్షలు బయలు దేరాయి.

ఉన్నట్లుండి ఒకనాడు కుముదిని తల్లితో అంది అతన్ని గురించి "నువ్వు అతన్ని చూస్తే బాగుంటుంది!"

"చూడకేం. నాలుగయిదుసార్లు మన ఇంటికి వచ్చినప్పుడు చూశాను కదా" అంది సత్యవతమ్మ.

"ఆ చూడడం కాదు." ఈ దృష్టితో చూడు." కుముదిని బుగ్గలు ఎర్రనవడం గమనించింది సత్యవతమ్మ.

"అతనికి ఇంకా పాతికేళ్ళన్నా నిండలేదనుకుంటాను" అంది సత్యవతమ్మ కాస్త విడ్డూరంగానే.

"అవును ఇంకా రెండేళ్ళు గడిస్తే గాని ఆ ముచ్చట తీరదు, నిజమే. అయినా అతను ఒప్పుకున్నాడు." ఇంతకంటే సూటిగా, సూక్ష్మంగా చెప్పడం ఎలాగో కుముదినికి చేతకాలేదు.

మగవాడు కనీసం నాలుగయిదేళ్ళయినా పెద్దవాడయి ఉంటే మంచిది కదూ. బొత్తిగా పదిహేనేళ్ళు చిన్నవాడు! ఏమిటి కుముదిని ఉద్దేశం?...సత్యవతమ్మకు ఏమీ మాటలు రాలేదు పైకి పెద్ద,చిన్న లేకుండా తోడూ నీడ మటుకే చాలు అనుకోవడం ఆమెకు చేత కాలేదు. ఈ కాలపు పిల్లలు...వాళ్ళ మనసుల్లో ఏ రకమయిన బూచులు వెంపర్లాడుతూ ఉంటాయో ఎవరూ నిర్ధారించి చెప్పలేరు. తమ చుట్టూ ప్రపంచంలో ఎన్నో రకాల దంపతుల్ని చూడడం అలవాటు అయిన తరువాత ఎవరికీ ఏమీ చెప్పలేం-ఇదే పద్ధతి అని.

అతనికి పెద్ద, చిన్నఎవరయినా ఉన్నారా? వాళ్ళు ఏమంటారో కనుక్కున్నాడా? తొందరపడడం లేదుగద అని మాత్రం అంది కూతురుతో.

ఏం కనుక్కోవాలి? అన్నీ కనుక్కోవటానికి ముందే కావలిసినవన్నీ అయిపోయాయి. కుముదినికి అతన్ని విడిచి ఉండటాన్ని ఊహించుకోవడమే చేతకాని పని అయిపోయింది.

కాదు కాదు. అవసరార్థం ఏమయినా చేయవచ్చు. తీరా బంధం దగ్గరకు వచ్చేసరికి ఎవరి మనసు ఎలా పీకుతుందో... తొందరపడి నిర్ణయాలు తీసుకోకూడదు. ఈ మాటే కూతురుతో చెప్పింది.

'తొందపడడం నాకు చేతకాదని నీకు తెలుసుగా, అమ్మా పెళ్ళికి తొందరపడ్డది నువ్వే కదా. ఇప్పుడేమో మీనమేషాలు లెక్క పెడుతున్నావు. ఏమిటో నీ ఆలోచనలు, నాకు అర్థం కావు-' అనుకుంది కుముదిని. ఈ మాటలు పైకి అనడానికి ధైర్యం చాలలేదు. అమ్మ చెప్పేది ఒక్కటే మాట. ఇప్పుడు అంతా బాగానే ఉన్నట్లే అనిపిస్తుంది. ఇంకో అరవయ్యేళ్ళు పోయింతర్వాత-నీకు అరవయి, అతనికి నలభై అయిదు! ముసలి పెళ్ళాం, పడుచు మొగుడు... ఇదేమన్నా సినిమా వ్యవహారమా! జీవితం! బాగా ఆలోచించుకో నువ్వే...

-ఈ మాటలు కుముదినికి కొట్టిపారవేయవలసినవిగా కనిపించలేదు. ముందు ఆలోచిస్తున్న మనసుకు అన్నీ అనర్థాలే కనిపిస్తాయి. నెగేటివ్ థింకింగ్...కదూ అనిపిస్తున్నది.

నిర్ణయం తీసుకోవలసిన వయసు దాటిపోయింది. తనకు. ఇప్పుడు వెనకడుగు

చేయటానికి లేదు. ఏమయితే అదే అవుతుంది. అయినా, ఏం అవుతుంది కనుక! ఎప్పటికప్పుడు ప్రస్తుతాన్ని గురించే ఆలోచించుకోవడంలో మనసుకు స్వేచ్ఛ ఉందికదూ!

"చంద్రశేఖరం! నన్ను గురించి కాదు మా అమ్మ ఆలోచిస్తూ ఉన్నది. నిన్ను గురించే ఆమె గుంజాటన లన్నీ" అంది కుముదిని అతనితో.

"మీ అమ్మగారికి నేను చెబుతానుగా! బాగా నచ్చ చెబుతాను నీవేం బెంగపడకు" అన్నాడు అతను.

'ఆడవాళ్ళ వయసు అడగకూడదు అనేది నానుడి. నిజమే. అసలు దాన్ని గురించి ఆలోచించడమే అనవసరం. అయినా, ఆడవాళ్ళు తమ వయసు బడటపడేటట్లు ప్రవర్తిస్తారా ఏమిటి? వయసుకు ఆడ, మగ అనే వ్యత్యాసం ఏమిటి? పైకి కనిపించడానికి తీసుకునే శ్రద్ధ ఎవరికిగానీ రక్షాకవచం అయిపోవడం ఈ రోజుల్లో చూస్తున్నాం కదా!' అనుకున్నాడు చంద్రశేఖరం.

"ఎప్పుడో చెబుతానంటే-వాయిదాలు వేసుకుంటూ పోతే కుదరదు. ఆ పని తక్షణం జరగాలి."

"ఏమిటిట అంత తక్షణం" కొంటెతనం, కాస్తంత వేళాకోళం మిళాయించిన స్వరంతో అన్నాడు అతను.

కుముదిని కాస్త తటపటాయించింది.

"కాదు, శేఖరం మన పెళ్ళి ఈ నెలలోనే జరగడం మంచిది. తప్పదు" అంది.

చంద్రశేఖరం ఆమె వంక లాలనగా, ఆసక్తిగా చూశాడు.

"నీకు అర్థం కాదు" అంది ఆమె మళ్ళీ.

"కుముదినీ, నాకు ఈ మతలబులన్నీ అర్థం కాని మాట నిజమేననుకో అయినా, ఇప్పుడే పుట్టిమునిగి పోయింది? ఎందుకంత తొందర?"

"అన్ మారీడ్ మదర్ అనిపించుకోవడం నాకు గిట్టదు. ఈ సాయంత్రమే నువ్వు మా అమ్మతో మాట్లాడేసెయ్యి"

"అంటే?"

"నాకిప్పుడు రెండో నెల!" అతని ఒళ్ళో ముఖం దాచుకుంది ముఖం పైకి తీసుకుంది.

"ఏం అట్లా అయిపోయినావు?"

"ఏమీలేదు, ఏమీ లేదు" కాస్త సంబాళించుకుంటూ తనను తాను ఉగ్గబట్టుకున్నాడు.

"సాయంత్రం వస్తావు కదూ! అన్నీ మాట్లాడుకుందాం" అంది కుముదిని ఇంకేం అనడానికీ చేతకాక.

"వస్తాను" అన్నాడు. కానీ, అతని మాటలోనే ఏదో పిరికితనం, భయం గోచరించాయి ఆమెకు. ఇదంతా తన ఊహే కావచ్చును. నా చంద్రం నన్ను మాయ చెయ్యడు. అతని తోడు లేకుండా నేను ఉండలేనట్లే, నా నీడ లేకుండా అతనూ మనలేడు. మేం ఇద్దరం

మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని ధైర్యం చెప్పుకుంది.

సాయంత్రం అతను రాలేదు.

"నేను చెబుతూనే ఉన్నాను కదూ! ముఖం చాటు వేశాడు" అంది సత్యవసతమ్మ.

ఏం అవసరం వచ్చి ఎక్కడ చిక్కుపడ్డాడో! నువ్వు ఊరికే కుశ్శంకలు పెంచుకోకు. అతన్లో నాకు, నాలో అతనికి పరిపూర్ణ విశ్వాసం ఇందులో నాకేం అనుమానం లేదు" అని పైకి తేలికగా అనేసినా, కుముదిని మాత్రం మనసులో బెంగపడుతూనే ఉంది.

మూడు రోజులు గడిచిపోయాయి.

చంద్రశేఖరం ముభావంగా ఉంటున్నాడు.

కుముదుని నిగ్గదీసి అడిగినప్పుడు, "కాస్త ఆలోచించుకోవటానికి టైం ఇవ్వు నాకు" అన్నాడు.

"ఏం ఆలోచిస్తావు? ఇందులో ఆలోచించటానికి ఏముంది?"

"చాలా ఉంది కుముదినీ. నన్ను ఒంటరిగా వదిలెయ్యి నాలుగు రోజులు నేను ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాను."

'మనసులు కలిసిన తర్వాత, వయసులు పెద్ద విషయం కానే కాదు' అన్న చంద్రశేఖరమేనా ఇతను.

నాలుగు రోజులు గడిచాక, మళ్ళీ కుముదినే పైకి తేలింది. "ఎంతమాత్రం ఆలస్యం కూడదు ఇంక. ఈరోజే అవునో, కాదో తేలిపోవాలి. కాదనవని నాకుతెలుసుననుకో" అంది ముందు కాళ్ళకు బంధం వేస్తున్నానని తనకి తెలియకుండానే.

చంద్రశేఖరం అతి తాపీగా అన్నాడు.

"వయసుల తేడా నన్నేం బాధించదు."

"మరి?"

"బిడ్డ తల్లిని పెళ్ళి చేసుకోవడం విషయమే నేను ఆలోచిస్తున్నది!"

"నీ బిడ్డే నీవూ- నేనే! నీకేం అనుమానమా?"

"నాకు ఆ విషయంలో ఏమీ అనుమానం లేదు."

"మరేమిటి?"

చంద్రశేఖరం వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

"కాస్త ఆలోచించకోనివ్వు కుముదినీ!"

"వారం పదిరోజులుగా ఆలోచిస్తూనే ఉన్నావు. కాదనడం చేతకాదు నీకు."

"మరి ఇప్పటి నుంచే, పిల్లలు...." అంటూ సణిగాడు.

"మనం కావలనుకున్నదీ లేదు, అక్కర్లేదనుకున్నదీ లేదు మరెందుకు నీకా సంశయం?"

"కాస్త ఆలోచించుకోనివ్వమన్నానుగా. నన్ను ఊరికే హైరాన పెట్టకు. నువ్వు

తొందరపడకు."

"తొందరెందుకో నీకు చెప్పనే చెప్పాను కదా! ఇంకేం అనేది?"

"అందుకే నేను ఆలోచిస్తున్నా దీన్ని! ఈ ప్రశ్న ముడిపడదు, వీడదు."

"వివరంగా చెప్పు"

"నిన్ను కాదనడం నాకు చేతకాదు అని నువ్వు చెప్తున్న మాట నేనూ మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను అయితే.."

"అయితే గియితే ఏమిటి?"

"ఏమిటిని గుచ్చి గుచ్చి అడిగితే నేనేం చెప్పేది? చెప్పలేకనే కదూ ఇంకా ఆలోచించుకోవాలి అంటున్నదీ..." అని సాగదీశాడు.

"ఎన్నాళ్ళు?"

"నా ఆలోచన తెగేంతవరకు?"

"అసలు నీ ఆలోచన ఏమిటో చెప్పరాదూ నేనూ వింటాను."

"కుముదినీ, నా బిడ్డే అయినా బిడ్డతో సహా నిన్ను పెళ్ళిచేసుకోవాలటే నాకు ఎబ్బెట్టుగా ఉంది."

"ఎబ్బెట్టుగా ఉంది? ఎందుకుట?" నిలువెల్లా దహించుకుపోతోంది కుముదిని.

పైకి మాత్రం మామూలుగా ఉన్నట్లు కనిపించడానికి ప్రయత్నం చేస్తోంది.

తాడు తెగే దాకా లాగడం ఆమెకూ ఇష్టంలేదు.

సత్యవతమ్మను తట్టుకోవడం కుముదినికి మరింత కష్టమైపోయింది.

"నెల తప్పినట్లు అతనికి చెప్పకుండా ఉండవలిసిందేమో అని ఆమె మందలించినప్పుడు నవ్వి ఊరుకుండిపోయింది కుముదిని.

"నిజంగా నెల తప్పావా" అంది సత్యవతమ్మ.

కుముదిని గట్టిగా తల్లిని కౌగలించుకుంది. మాట పలుకూ లేదు. సత్యవతమ్మ ఉక్కిరి బిక్కిరి అయిపోయింది.

"ఎంత గందరగోళంలో పడిపోయావే నాతల్లీ" అని ఆమెను ఓదార్చే ప్రయత్నంలో పడిపోయింది.

నెల రోజులు గడిచాక... చంద్రశేఖరం వచ్చాడు.

"బాగా ఆలోచించుకున్నాను కుముదినీ, సరే నాకు ఇష్టమే" అన్నాడు.

అంటూ తాను ఆలోచించుకున్న క్రమం అంతా ఏకరవు పెట్టడానికి ప్రయత్నించాడు. కుముదిని అతన్ని ముందుకు పోనివ్వడం మంచిది కాదనుకుంది. అనవసరం అయిన విషయాలు పోగుచేసుకోవాలని ఎందుకు ఆదుర్దా!

"నీవేం చెప్పనక్కర్లేదు చంద్రశేఖరం" అంది. రాఫిల్స్ సెంటర్ దాటి ముందుకు వస్తున్నారు.

"కోమల విలాస్‌కు వెడదామా" అన్నాడు చంద్రశేఖరం మాట మారుస్తూ.

కుముదినికి తొందరగా ఇంటికి వెళ్ళాలని ఉంది.

"సమయం మించిపోయింది చంద్రశేఖరం. యూ ఆర్ టూ లేట్" అంది కుముదిని.

"నిన్ను విడిచి ఉండడం నాకు చేతకాదని తేలిపోయింది కుముదినీ! ఈ నెల రోజులూ నేను పడ్డ యాతన, వేదన ఎక్కువ మాటల్లో పెట్టలేను. నన్ను క్షమించు" అంటూ చంద్రశేఖరం బావురుమన్నాడు.

"లాభం లేదు చంద్రశేఖరం యూ ఆర్ టూ లేట్" అన్న మాట తప్ప ఇంకేం మాటలూ రాలేదు కుముదిని దగ్గర్నుంచి.

"నన్ను క్షమించలేవా కుముదినీ!"

"నిన్ను క్షమించడానికి నేనెవర్ని చంద్రశేఖరం? నిన్ను నీవే క్షమించుకోవాలి!"

సత్యవతమ్మ అయితే, "ఇప్పుడు నువ్వేం చేస్తానంటావు" అని నిలదీసింది కూతుర్ని.

"ఏమీ చేయను. ఏమీ చేయనక్కర్లేదు కూడా! నూరు అబద్ధాలు ఆడి పెళ్ళి చేయడం వెనకటి రోజుల్లో మాట అయితే, ఇప్పుడు ఒక్క అబద్ధంతో మనిషి నిజాయితీని పరీక్షించగలిగాను. అంతే! ఈ విషయం ఇక్కడితో కట్టిపెట్టు."

"మరి...మరి నీలో ఎదుగుతున్న చంద్రుడు?"

"అబద్ధాల వలలోంచి రాలిపోయాడు. ఆ ఎదిగే చంద్రుడు అల్లంత దూరంలో ఆకాశంలోనే ఉండిపోనీ" అంది కుముదిని.

*ఇండియా టుడే-2001*